సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 9 | జనవరి | 2025



ముగ్గు.. ముచ్చట

సంక్రాంతి నెల ప్రారంభం నుంచి ఇళ్ల ముందు పెట్టే ముగ్గులకు కూడా ఎంతో ప్రత్యేకత ఉంది. అవి కేవలం అందం కోసమే కాదు. వాటి గీతల్లో మన సంప్రదాయాలు కలిపి ఉంటాయి.


8లో



ఆందోళన బాటలో..

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళనలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు.

డెల్టా కాలువలకు 11,240 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 11,240 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 10.90 నీటిమట్టం అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

'పది' పరీక్షలు రాయనున్న 19,217 మంది

రాయవరం: జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరంలో 19,217 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కానున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. మండలంలోని మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక **విలేకరులతో** మాట్లాడుతూ జిల్లాలో ఉన్న **287 ప్రభుత్వ,** ప్రభుత్వ యాజమాన్య **పాఠశాలలు, 171** ప్రైవేట్ పాఠశాలల నుంచి **విద్యార్థులు పది** పరీక్షలకు హాజరవుతారన్నారు. **వీరి కోసం** జిల్లా వ్యాప్తంగా 111 **పరీక్షా కేంద్రాలను** ఎంపిక చేసినట్లు తెలిపారు. **శతశాతం ఉత్తీర్ణతకు** ఉపాధ్యాయులు 100 **రోజుల ప్రణాళిక**ను అమలు చేస్తున్నట్లు **తెలిపారు. ప్రధా**నమంత్రి పరీక్షా పే చర్చా **కార్యక్రమంలో** పాల్గొనేందుకు జిల్లాలో **87,076 మంది** నమోదు చేసుకున్నట్లు **తెలిపారు. వీరిలో** 80,237 మంది విద్యార్థు**లు, 5,372 మంది** ఉపాధ్యాయులు, 1,467 **మంది తల్లిదం**డ్రులు ఉన్నారన్నారు.

నేడు ఉపాధ్యాయులకు ఓరియంటేషన్

రాయవరం: పాఠశాల విద్య అనంతరం విద్యార్థుల సొంత కాళ్లపై నిలబడేలా చేసేందుకు విద్యాశాఖ పలు కార్యక్రమాలు చేపడుతోంది. దానిలో భాగంగా తొమ్మిదో తరగతి నుంచే వారిలో పారిశ్రామిక మనస్తత్వాన్ని అభివృద్ధి చేసేందుకు పాఠ్యాంశాన్ని అమలు చేస్తోంది. ఈ మేరకు 2022–23 విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఈ కోర్సును ప్రారంభించాల్సి ఉంది. కానీ విద్యా సంవత్సరం చివరి నాటికి అనుమతి లభించడం విశేషం. ఈ మేరకు అమలాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శుక్రవారం ఒక్క రోజు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించనున్నారు.



మలికిపురం మండలం శంకరగుప్తంలో నీరందని వారుమడులు



ఉప్పలగుప్తంలో తొలి దమ్ములు చేసిన వరిచేలు

తడవని మడి

- ముందుకు సాగని రబీ
- 1.60 లక్షల ఎకరాల లక్ష్యం
- ఇప్పటివరకు 62 వేల ఎకరాల్లో పనులు
- శివారులో మొదలైన నీటి కష్టాలు
- పెట్టుబడి కోసం రైతుల అవస్థలు

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ 'సాగు'తోంది. పంట షెడ్యూలు మొదలై నెల రోజులు దాటినా ఇంత వరకూ మూడో వంత మాత్రమే నాట్లు, వెదజల్లు విధానంలో సాగయ్యింది. ఇదే సమయంలో డెల్టాలో శివారు ప్రాంతాలకు సాగు నీరు అందకపోవడం రైతులకు కొత్త తలనొప్పి తెస్తోంది. జిల్లాలో రబీ వరిసాగు లక్ష్యం 1.60 లక్షల ఎకరాలు కాగా.. ఇంత వరకు కేవలం 62 వేల ఎకరాల్లో మాత్రమే పనులు జరిగాయి. దీనిలో 48 వేల ఎకరాల్లో వెదజల్లు, 14 వేల ఎకరాల్లో నాట్లు వేశారు.

నత్తనడకన..

రబీ షెడ్యూల్ డిసెంబర్ ఏడో తేదీన మొదలైంది. ఆ సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు సాగు ఆలస్యమైంది. అయితే ఇప్పుడు షెడ్యూలు మొదలై 40 రోజులు దాటుతున్నా సాగు నత్తనడకన జరుగుతోంది. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. నాట్లు ఆలస్యంగా పడితే ఏప్రిల్ 15 తర్వాత కూడా సాగు నీరు విడుదల చేయాల్సి వస్తుంది.

కొరవడిన ప్రభుత్వ సహకారం

ముందస్తు సాగు చేద్దామని కొందరు రైతులు భావించినా డిసెంబర్ మొదటి పది రోజులు వాతావరణం సహకరించలేదు. తీరంలో వర్షాలు కారణంగా చేల నుంచి ముంపు నీరు వీడకపోవడంతో పనులు సాగలేదు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన, అల్లవరం, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లోని చేలల్లో రెండు, మూడు అడుగుల లోతున నీరు ఉండడంతో నారుమడులు వేయలేకపోయారు. వేసిన చోట వర్షాలు ముంచెత్తాయి. దీనితో రెండోసారి నాట్లు వేయాల్సి వచ్చింది. తరువాత బొండాల రకం (ఎంటీయూ 3626) రకం విత్తనాలు దొరకకపోవడం కూడా సాగు మందకొడిగా సాగడానికి కారణమైంది. వీటన్నింటికన్నా ప్రధానమైన కారణం. రైతులు వద్ద పెట్టుబడులకు సరిపడా సొమ్ములు లేవు. ఖరీఫ్ పంట పండినా వర్షాల వల్ల దిగుబడి కోల్పోయి నష్టాలు చూశారు. నష్టపోయిన **పంటకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి రాయితీ రాలేదు. కనీసం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకంలో ఇస్తామన్న రైతుకు పెట్టుబడి సాయం ఇంత వరకు ఇవ్వలేదు. దీనితో రైతులకు అప్పు పుట్టక సాగు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు.**

శివారుకు అందని సాగునీరు

అవాంతరాలను అధిగమించిన సమయంలో ఇప్పుడు డెల్టాలో శివారు ప్రాంతాలకు సమృద్ధిగా సాగునీరందకుండా పోయింది. గోదావరిలో జలాలు అందుబాటులో ఉన్నాయని, ఈ ఏడాది నీటి ఎద్దడి రాదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. నీరందక విత్తనాలు జల్లిన మడులు ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. సఖినేటిపల్లి, మలికిపురం, మామిడికుదురు, అల్లవరం, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, అమలాపురం మండలాల్లో శివారు, మెరక ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. డెల్టాలో పంట కాలువలకు అధికంగా నీరు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 6,570 క్యూసెక్కుల చొప్పున మొత్తం 12,810 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇంత పెద్ద ఎత్తున నీరు విడుదల చేయడం మంచిదే అయినా డెల్టా కాలువ వ్యవస్థ అధ్వానంగా ఉండడం వల్ల శివారు, మెరక ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు.

40 రోజులు.. 31 టీఎంసీలు

రబీ మొదలైన తరువాత మంగళవారం వరకు తూర్పు డెల్టాకు 10.323, మధ్య డెల్టాకు 5.559, పశ్చిమ డెల్టాకు 10.323 టీఎంసీలు చొప్పున మొత్తం 31.658 టీఎంసీల నీరు విడుదల చేశారు. పంట కాలువ వ్యవస్థ అధ్వానంగా ఉండడం, చేలల్లో ముంపు నీరు దిగకపోవడం, విత్తనాల కొరత, వెరసి సాగుపై రైతులు నిర్లిప్తత.. ఇలా కారణాలు ఏదైనా ప్రస్తుత రబీ అంచనాల కన్నా ఆలస్య మవడం వల్ల మే నెలలో వచ్చే అకాల వాయుగుండాలు, తుపాన్ల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది.

నారు ఎండిపోయే పరిస్థితి



మా ప్రాంతానికి పూర్తిగా నీరు రావడం లేదు. దీనితో మా చేలల్లో నారుమడులు ఎండిపోయేలా ఉన్నాయి. మొన్నటి వరకు నారు వేయలేని పరిస్థితి. ఇప్పుడు నారుమడికి నీరందని దుస్థితి. శివారులో సాగు చేయడం చాలా కష్టంగా మారింది. రబీ పెట్టుబడికి సొమ్ములు చేతిలో లేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు.

– చవ్వాకుల ప్రభు కుమార్, రైతు, శంకరగుప్తం, మలికిపురం మండలం

అధికారుల పర్యవేక్షణ లేదు



నేను రెండు ఎకరాలు సాగు చేస్తున్నాను. ముంపు నీరు దిగనందున సాగు ఆలస్యమైంది. నారుమడి వేసి వారం రోజులు అయింది. మా సమీపంలో ఉన్న పాయకరావు కోడు నుంచి నీరు దిగడం లేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత డ్రెయిన్లపై అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది.

– చిక్కం సీతారామ ప్రసాద్, రైతు, ఉప్పలగుప్తం

బేరసారాలు.. బుజ్జగింపులు

- పి.గన్నవరం నియోజకవర్గంలో పదవులకు ధరలు
- రూ.రెండు లక్షలు ఇస్తే సొసైటీ చైర్మన్ పదవి
- హల్‌చల్ చేస్తున్న జనసేన నేత వాయిస్ రికార్డ్

సాక్షి అమలాపురం: ''ఇప్పుడు రాజకీయ వ్యవస్థ ఎలా ఉందంటే పనిచేస్తే పదవులు రావు. నేను పార్టీకి ఎంతో ఖర్చు పెట్టాను. పదవి లేకపోవడం వల్ల నోర్మూసుకుని కూర్చున్నాను. నాకు దేవస్థానం పదవి కావాలంటే రూ.ఏడు లక్షలు అడిగారు. అంత ఇవ్వలేక ఊరుకున్నాను. మీరు మా ఇంటిలో మనిషి కాబట్టి రూ.రెండు లక్షలు ఇస్తే పదవి ఇప్పిస్తాను. అవతల వ్యక్తి రూ.ఐదు లక్షలు ఇస్తానన్నారు'. ఇది మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకకు చెందిన ఒక జనసేన నేత పీఏసీఎస్ పదవి ఆశిస్తున్న వ్యక్తి కుటుంబానికి ఇచ్చిన బంపర్ ఆఫర్. సదరు బేరంపెట్టిన నాయకుడు, పదవి ఆశిస్తున్న పార్టీ నాయకుడు మధ్య జరిగిన సంభాషణ సోమవారం రాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా హల్‌చల్ చేస్తోంది.

పదవుల అమ్మకం!

ప్రశ్నించే పార్టీలో నామినేటెడ్ పదవుల అమ్మకం, వాటికి కట్టిన రేటు జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. మూడక్షరాల జనసేన నేత మండల వ్యాప్తంగా సహకార సంఘాలకు వేసే త్రీమెన్ కమిటీ ఆశావహులకు ఫోన్లు చేసి ఆఫర్లు ఇవ్వడం గమనార్హం.

- అంబాజీపేట పీఏసీఎస్ తీవ్ర ఉత్కంఠ రేపింది. టీడీపీ, జనసేన పార్టీల మధ్య, జనసేనలో కొర్లపాటివారిపాలెం, మాచవరం అని రెండుగా విడిపోయి ప్రాంతీయ విభేదాలకు దారితీసింది. టీడీపీలోను, జనసేన పార్టీలలో సైతం వర్గపోరుకు తెరలేసింది. చివరకు మాచవరానికి చెందిన అరిగెల సూరిబాబుకు పదవి ఇచ్చినా ఎమ్మెల్యే అసంతృప్తిగానే ఈ పదవి కట్టబెట్టడం గమనార్హం.
- ఇదే మండలంలో గంగలకుర్రు సొసైటీకి తొలి నుంచి శెట్టిబలిజ వర్గానికి చెందిన వారికి ఇస్తారు. అయితే ఈసారి జనసేనకు ఇస్తామని చెప్పి ఇక్కడ కాపు వర్గానికి చెందిన వారికి ఇవ్వడంపై జనసేనలోని శెట్టిబలిజ వర్గీయులు, టీడీపీ వారు మండిపడుతున్నారు.

తెలుగు రక్షణ అమ్మ నుంచే ఆరంభం



ప్రపంచ తెలుగు మహాసభలలో సాంస్కృతిక బృందాన్ని అభినందిస్తున్న వర్సిటీ ప్రతినిధులు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

ప్రపంచ తెలుగు మహాసభలలో పలువురి సూచన

రాజానగరం: 'దేశ భాషలందు తెలుగు లెస్స' అంటూ శ్రీకృష్ణదేవరాయులుతో ఏనాడో కితాబు అందుకున్న భాష... ఆధునిక సమాజంలో పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో ఆదరణకు దూరమవుతున్న వేళ .. అమ్మ భాషను పరిరక్షించుకోవాలంటే అది అమ్మ నుంచే ప్రారంభం కావాలని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. అమ్మ భాష కమ్మదనాన్ని, మాతృ భాష ప్రాశస్త్యాన్ని, ప్రాచీనతను కాపాడేందుకు ఎందరో మహనీయులు నిరంతరం ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇందులో భాగంగా గోదావరి తీరాన రాజమహేంద్రవరానికి చేరువలో ఉన్న గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయు)లో చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించేందుకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆదికవి నన్నయ, రాజరాజనరేంద్రుడు, కందుకూరి వీరేశలింగం పేరిట ఏర్పాటు చేసిన మూడు వేదికలపై నుంచి మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, మహాసహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు, సాహితీవేత్త యర్రాప్రగడ రామకృష్ణ, ప్రముఖ సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆధ్యాత్మికవేత్త పి.బంగారయ్యశర్మ, ప్రొఫెసర్ చామర్తి కేటీ రామరాజు, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా సోలోమెన్ డార్విన్, మాజీ ఎమ్మెల్సీ గోనె ప్రకాశరావు, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, ధూళిపాల మహాదేవమణి, పారిశ్రామికవేత్త మృత్యుంజయేశ్వర్, వైద్య ప్రముఖులు కన్నయ కదంజి, శాస్త్రవేత్త ఆర్. శ్యామసుందర్, వంటి ఎందరో ప్రముఖులు తెలుగు భాష విశిష్టతను, ఔనత్యాన్ని, తెలియజేస్తూ ప్రసంగించారు. ఉగ్గు పాలతో ప్రారంభించాలి.

సృష్టిలో భాషలెన్ని ఉన్నా, తెలుగు భాషకు ఉన్న విశిష్టత, మాధుర్యం, అక్షరాల అల్లిక, పదాల పలకరింపులు మరే ఇతర భాషలలోను లేవంటూ ప్రాచీన భాష అయిన తెలుగు ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. మాతృభాషను మరుగున పరిచేలా ఏర్పడుతున్న ప్రస్తుత పరిస్థితులకు అందరూ కారకులేనని వివరించారు. 'మమ్మీ, డాడీ..' అనే ఆంగ్ల పదాల పలకరింపులతో పులకరించిపోతున్న తల్లిదండ్రులు ప్రధాన కారకులనే విషయాన్ని తేటతెల్ల చేశారు. ఈ కారణంగా మన భాషకు పూర్వ వైభవం రావాలంటే అది తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని, తమ పిల్లలకు ఉగ్గుపాలతో పదాలను పలకడం నేర్పిన విధంగానే తెలుగు భాషను ప్రతి ఇంటా పలకాలని, అది అమ్మ నుంచే ప్రారంభించాలని సూచించారు. కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు కూడా ఇదే అంశాన్ని వినిపించారు.

ఇంటిలో వాడుక భాష కావాలి



ఇటువంటి సభలు, సదస్సుల వలన ప్రయోజనం ఉంటుంది. భావితరాల వారిలోనూ మార్పు వస్తుంది. అయితే అందుకు మనం కూడా కొంత ప్రయత్నం చేయాలి. తెలుగు వారి ప్రతి ఇంటిలో వాడుక భాషగా తెలుగు కచ్చితంగా ఉండాలి. గతంలో తాత, నానమ్మలు పెద్ద బాలశిక్ష, చిన బాలశిక్షలతో అన్నీ నేర్పేవారు, ఇప్పుడు అవేమీ లేవు. అంతా ఏ ఫర్ యాపిల్, బి ఫర్ బాల్ అయిపోయింది. అది మార్చాలంటే ఇంటిలో అమ్మ శ్రద్ధ తీసుకోవాలి.

– ఆధ్యాత్మికవేత్త పి.బంగారయ్యశర్మ

మాతృ భాషకు అన్యాయం చేస్తున్నారు



ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగు వాడు బతికేయగలుగుతున్నాడు. అపారమైన తెలివి తేటలున్నవాడు కావడమే దీనికి ప్రధాన కారణం. ఇదే క్రమంలో ఆంగ్ల భాషపై పట్టుసాధించాలనే తపనతో మాతృ భాషకు అన్యాయం చేస్తున్నామనే విషయాన్ని ఈ మేధావి గుర్తించలేకపోతున్నాడు. తెలుగు మాట్లాడమే నామోషీగా భావిస్తున్నాడు. అందుకనే తెలుగు భాష వాడకం తగ్గిపోతోంది. ఇది మారాలి.

– శైలజ, విద్యార్థి

తెలుగు భాష అంటే ఎంతో ఇష్టం



తెలుగు భాష అంటే ఎంతో ఇష్టం. ఇంగ్లిష్‌లో మాట్లాడటం అంటే ఒక ఫ్యాషన్ అయిపోవడంతో అంతా అటువైపు చూస్తున్నారుగానీ, తెలుగులో ఉన్న పదాలు, పదనిసలు మరే భాషలోనూ కనిపించవు. అందుకనే తెలుగంటే నాకెంతో ఇష్టం.

– కీర్తి, విద్యార్థి

ఇటువంటి సదస్సులు తరచూ జరగాలి



తెలుగు భాష పటిష్టత కోసం ఇటువంటి సదస్సులు తరచు జరగాలి. ఏ ఒక్కరితోనో వీటిని వదిలేయకుండా ప్రతి ఒక్కరూ వీటిలో భాగస్వాములైతే భాషా ఔన్నత్యం పెరుగుతుంది. ప్రభుత్వాలు కూడా వీటిపై దృష్టిని పెట్టి, ప్రభుత్వ కార్యకలాపాలన్నిటిలోను తెలుగు భాషకు ప్రాధాన్యమిస్తే, ప్రస్తుత తరంతోపాటు భావితరాలు కూడా మాతృ భాష పట్ల ఆదరణ, అభిమానం చూపిస్తాయి.

– మంజునాథ్, విద్యార్థి

తల్లిదండ్రులదే బాధ్యత



జన్మనిచ్చిన అమ్మ ఉగ్గుపాలతో మాటలు నేర్పిస్తుంది. అంటే అమ్మ ఏ భాషను నేర్పిస్తే, బిడ్డ అదే నేర్చుకుంటాడు. ఈ క్రమంలో మన మాతృభాష గురించి తల్లిదండ్రులు ఏదంగా చెబితే పిల్లలు దానినే ఆచరిస్తారు. అంటే మాతృభాష పరిరక్షణ విషయంలో తల్లిదండ్రులదే ప్రధాన బాధ్యత అంటాను. ఎందుకంటే చదువు కోసం, ఆపై ఉద్యోగాల కోసం పరాయి భాషలను నేర్చుకున్నా ఇంటిలో మాతృ భాషను మరవనప్పుడు ఆ ఇంటిలో మాతృభాష పదికాలాలపాటు పరిఢవిల్లుతుంది.

–మనోజ్ఞ, విద్యార్థి

తెలుగు సంస్కృతికి దూరమవుతున్నారు



ప్రపంచీకరణలో భాగంగా ఏర్పడిన ప్రాశ్చాత్య సంస్కృతి కారణంగా చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను మమ్మీ, డాడీల కల్చర్‌తో తెలుగు సంస్కృతికి దూరం చేస్తున్నారు. ఇటువంటి సభలు నిర్వహించడం వలన విద్యార్థులలో మాతృభాషపై అవగాహన ఏర్పడటానికి, తల్లిదండ్రులలో మార్పు రావడానికి అవకాశం ఉంటుంది. ఇంగ్లిష్ నేర్చుకోవడం మంచిదే కానీ, ఇంటిలో కూడా ఇంగ్లిష్‌లోనే మాట్లాడుకుంటే మన మాతృభాష ఏమవుతుందనే విషయాన్ని తెలుగు వారైన ప్రతి తల్లి, తండ్రి గ్రహించాలి.

– గోనె ప్రకాశరావు, ఎమ్మెల్సీ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.1.30 లక్షల జరిమానా

జగ్గంపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి రూ.1.30 లక్షల జరిమానా, రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలో బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 18 మందిని గుర్తించామన్నారు. వారిని కోర్టులో ప్రవేశ పెట్టగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 13 మందికి జరిమానా, ఐదుగురికి రెండు రోజులు జైలు శిక్ష విధించామన్నారు.

ముగ్గు.. ముచ్చట

- గ్రామాల్లో సంక్రాంతి సందడి
- ఇళ్ల ముందు ముగ్గుల కనువిందు

రాజమహేంద్రవరం రూరల్: సంక్రాంతిని ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలందరూ సిద్ధమవుతున్నారు. భోగిమంటలు, పిండి వంటలు, కోడి పందేలు, డూడూ బసవన్నల సందడితో సంబరాలు అంబరాన్ని తాకనున్నాయి. అలాగే సంక్రాంతి నెల ప్రారంభం నుంచి ఇళ్ల ముందు పెట్టే ముగ్గులకు కూడా ఎంతో ప్రత్యేకత ఉంది. అవి కేవలం అందం కోసమే కాదు, వాటి గీతల్లో మన సంప్రదాయాలు కలిపి ఉంటాయి. ప్రస్తుతం ప్రతి ఇంటి ముందు ముగ్గులు మెరుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో ఈ సందడి కనిపిస్తోంది.

ధనుర్మాసంలో..

ముంగిట మెరిసే ముత్యాల ముగ్గు ధనుర్మాసానికి ప్రతీక. పన్నెండు చుక్కల ముగ్గు వైకుంఠ ద్వారాలకు సూచిక. గుమ్మడికాయ ముగ్గు నెలగంటు వేయాలని చెప్పే వీచిక. రథం ముగ్గు సూరీడికి స్వాగత గీతిక. ఇలా ఒక్కో ముగ్గుకు ఒక్కో ముచ్చట ఉంటుంది. ధనుర్మాసం ప్రారంభం నుంచి రకరకాల పేర్లతో ముగ్గులను వేయడం మన సంప్రదాయం. వీటిలో ప్రతి ముగ్గుకూ ఒకో అర్థం ఉంటుంది.

ముఖ్యమైన ముగ్గులు

సంక్రాంతికి ముఖ్యమైన ముగ్గులు కొన్ని ఉన్నాయి. సంక్రాంతి పురుషుడిని ఆహ్వానించడం కోసం వీటిని వేస్తారు. 12 ద్వారాల ముగ్గులు ద్వారా వైకుంఠ ద్వారాలు తెరచినట్లుగా అర్థం వస్తుంది. మన పితృదేవతలు వైకుంఠానికి వెళ్లడానికి మార్గమని చెబుతారు. ఈ ముగ్గు కేవలం సంక్రాంతి రోజు మాత్రమే వేస్తారు. గుమ్మడికాయ ఆకారంలో వేసే ముగ్గు నెలగంటు నుంచి ధనుర్మాసమంతా పెడతారు. మూడు రోజుల పాటు పండగలను చేసుకున్న తర్వాత సంక్రాంతి పురుషుడిని ఆనందంగా సాగనంపేందుకు రథం ముగ్గు వేస్తారు. రథం తాడును ఒక ఇంటి నుంచి మరో ఇంటికి ముగ్గుతో కలుపుతూ పోతుంటారు. మకర సంక్రాంతి నుంచి సూర్యరశ్మిలో వేడి పెరుగుతుంది. ఇప్పటి వరకూ తీవ్రమైన చలిని ఎదుర్కొన్న ప్రజలు సూర్యుడిని ఆహ్వానిస్తూ రథం ముగ్గును వేస్తారు.

వ్యాధులు దూరం

మకర సంక్రాంతి రోజు గ్రామీణ ప్రాంతాల్లో తెల్లవారుజామున ఆవుపేడతో వాకిలిలో కళ్లాపి చల్లి, ముగ్గులు వేస్తారు. ముగ్గుల మధ్య పేడతో గొబ్బెమ్మలు పెట్టి పూలు అలంకరిస్తారు. వీటి వల్ల క్రిమి కీటకాలు, వ్యాధులు దూరమవుతాయి. వరిపిండితో ముగ్గు వేయడంతో చీమలకు ఆహారం అందించినట్లు భావిస్తారు.



ముగ్గు వేస్తున్న మహిళలు



రథం ముగ్గు




గుమ్మడికాయ ముగ్గు

సంప్రదాయానికి ప్రతీక



ముగ్గులు మన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయి. సందర్భానుసారంగా వివిధ రకాల ముగ్గులు వేస్తూ ఉంటాం. ఇక ధనుర్మాసంలో వేసే వాటిని ఎంతో ప్రత్యేకత ఉంటుంది. ప్రతి ముగ్గుకు ఒక అర్థం ఉంది. మన సంస్కృతిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలి.

– మేడపాటి కుసుమ, గృహిణి, నేతాజీ నగర్, బొమ్మూరు



ద్వారాల ముగ్గు

ఆలయంలో తాచుపాము



ర్యాలి ఆలయంలో గోధుమతాచు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని శివకేశవ ఆలయాల మధ్యలో ఉన్న కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర పుత్ర శక్తి గణపతి ఆలయంలో ఒక గోధుమతాచు హల్‌చల్ చేసింది. రెండు రోజులైన ఆలయం నుంచి బయటకు వెళ్లలేదు. దీంతో రాజమహేంద్రవరానికి చెందిన స్నేక్ క్యాచర్ మాధవ్‌కు ఆలయ కమిటీ సమాచారం అందించారు. ఆయన సుమారు రెండు గంటల ప్రయత్నించి మంగళవారం రాత్రి 11 గంటలకు పామును పట్టుకున్నారు. అనంతరం అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారని ఆలయ కమిటీ చైర్మన్ చింతా సూర్యచంద్రరావు తెలిపారు.

జేఎన్‌టీయూకే వీసీ ఎంపికకు సెర్చ్ కమిటీ నియామకం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే వీసీ నియామకానికి ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీని బుధవారం ఉన్నత విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించే సభ్యునిగా నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ కే.నిరూపరాణి, పాలక మండలి తరఫున జేఎన్‌టీయూహెచ్ మాజీ వీసీ ప్రొఫెసర్ డీఎన్ రెడ్డి, యూజీసీ తరఫున ప్రొఫెసర్ వీజీనాధన్ కామకోటిని నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. వీరు ముగ్గురు జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ వీసీ పదవి కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారి పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు.

ఆందోళన బాటలో సహకార ఉద్యోగులు

- దశల వారీగా నిరసనలకు కార్యాచరణ
- తొలి రోజు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

అమలాపురం టౌన్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ డిమాండ్ల సాధన కోసం దశల వారీగా ఆందోళనలు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నారు. దీనిలో భాగంగా బుధవారం నుంచి నెల రోజుల పాటు ఆరు దశలో ఆందోళనలు చేపట్టేందుకు నిర్ణయించారు. సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్‌సీ పాలసీ అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఆందోళనకు సిద్ధమయ్యారు.

ఉమ్మడి జిల్లాలో 320 సంఘాలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 320 వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. వాటిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 166, తూర్పు గోదావరి జిల్లాలో 108, కాకినాడ జిల్లాలో 72 సంఘాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 1,650 మంది సహకార ఉద్యోగులుగా వివిధ హోదాలు, కేటగిరీల్లో పనిచేస్తున్నారు. రాష్ట్ర సహకార ఉద్యోగుల యూనియన్ ఈ ఆందోళన కార్యక్రమాలను రూపొందించి ఆయా జిల్లాలకు పంపించింది. విజయవాడలో ఈ నెల 5వ తేదీన జరిగిన రాష్ట్ర యూనియన్ సమావేశంలో ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనకు దిగినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు వెల్లడించారు.

నిరసనల షెడ్యూల్

ఆందోళనలో భాగంగా తొలిరోజు బుధవారం జిల్లాలోని సహకార ఉద్యోగులందరూ నల్లబాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. రెండో దశలో గురువారం నుంచి పార్లర్ రన్‌తో పాటు అన్ని కంప్యూటర్ వర్కులను నిలుపుదల చేస్తారు. మూడో దశలో ఈ నెల 10 నుంచి కాకినాడ డీసీసీడీ ప్రధాన కార్యాలయం ఎదుట ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సహకార ఉద్యోగులు ఉమ్మడిగా ధర్నా నిర్వహిస్తారు. నాలుగో దశగా ఈ నెల 20న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాకు దిగుతారు. ఐదో దశలో ఈ నెల 27న విజయవాడలోని రాష్ట్ర సహకార బ్యాంక్ వద్ద అన్ని జిల్లాల ఉద్యోగులతో మహా ధర్నా నిర్వహిస్తారు. ఆరో దశలో ఫిబ్రవరి 10 నుంచి అప్పటికీ సమస్య పరిష్కారం కాని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగాలని కార్యాచరణ రూపొందించుకున్నారు.



జిల్లా సహకార అధికారి మురళీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న సహకార ఉద్యోగుల యూనియన్ ప్రతినిధులు

వినతి పత్రాల అందజేత

తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర సహకార శాఖ తక్షణమే స్పందించాలని జిల్లా సహకార ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. బుధవారం నుంచి దాదాపు నెల రోజుల పాటు దశల వారీగా ఆందోళనలకు దిగుతున్నట్లు జిల్లా సహకార ఉద్యోగుల యూనియన్ ప్రతినిధుల బృందం అమలాపురంలో కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణకు వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు. జిల్లా సహకార ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి పింకే సత్యనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శులు కుంపట్ల అయ్యప్ప నాయుడు, మట్టపర్తి జయరామ్, కోశాధికారి బొబ్బా రామసుబ్రహ్మణ్యాచారితో కూడిన జిల్లా యూనియన్ బృందం ఆ అధికారులతో తమ ఆందోళన కార్యక్రమాలను వివరించారు.

అక్షర నిధి.. కృత్తివెంటి బడి


- వేలాది మందికి విద్యాదానం
- పాఠశాలకు 118 ఏళ్ల చరిత్ర
- నేడు వార్షికోత్సవం

రామచంద్రపురం: అన్ని దానాలలో విద్యాదానం చాలా గొప్పది. మనిషి మనుగడకు, సమాజ వికాసానికి ఎంతో తోడ్పడుతుంది. బాధ్యత కలిగిన పౌరులను తయారు చేస్తుంది. సమాజంలో విద్యా వికాసం కోసం ఎందరో మహానుభావులు కృషి చేశారు. వారిలో కృత్తివెంట పేర్రాజు పంతులు ఒకరు. ఆయన రామచంద్రపురంలో స్థాపించిన పాఠశాల ఈ ప్రాంతంలో విద్యా పరిమళాలను వెదజల్లింది. ఎందరినో ఉన్నత విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దింది. 118 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఆ పాఠశాల గురువారం వార్షికోత్సవం జరుపుకొంటోంది. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

1905లో ఏర్పాటు

కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని కృత్తివెన్ను గ్రామానికి చెందిన కృత్తివెంటి కృష్ణారావు కుమారుడు కృత్తివెంటి పేర్రాజు 1852లో కాకినాడలో జన్మించారు. వృత్తి రీత్యా న్యాయవాదిగా స్థిరపడిన ఆయన.. రామచంద్రపురానికి ఒక కేసును వాదించేందుకు వచ్చారు. ఆ కేసు విషయంతో నిరక్షరాస్యులైన ఇద్దరు అన్నదమ్ముల తీరు ఆయనను కలచి వేసింది. ఇక్కడ ఓ పాఠశాల ఉంటే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో 1905లో జాతీయ పాఠశాల పేరుతో రామచంద్రపురంలో మిడిల్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. 4 నుంచి 8వ తరగతి వరకూ చదువు చెప్పేవారు. ఈ స్కూలుకు ఆలమూరు, అనపర్తి, వేళంగి, కోటిపల్లి తదితర సుదూర గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. అనంతరం 1906లో ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందింది. ఈ స్కూల్ నిర్వహణకు కృత్తివెంటి పేర్రాజు పంతులు 94 ఎకరాల, 21 సెంట్లను దానం చేసి, పాఠశాల అభివృద్ధికి వినియోగించాలని స్పష్టం చేశారు.





కృత్తివెంటి పేర్రాజు పంతులు స్థాపించిన పాఠశాల. (అంతరచిత్రం) కృత్తివెంటి పేర్రాజు (ఫైల్)

మరెందరో కృషి ఫలితంగా..

పూర్వ విద్యార్థులైన రాజా కాకర్లపూడి రాజగోపాలనరసరావు, రాజా రామచంద్ర బహద్దూర్, అడ్డూరి పద్మనాభరాజు, నందివాడ సత్యనారాయణరావు, చుండ్రు శ్రీహరిరావు తదితరులు కృషితో కృత్తివెంటి విద్యా సంస్థలు ఎంతో అభివృద్ధి చెందాయి. నియోజకవర్గానికి మొట్టమొదటి మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పాఠశాలను సందర్శించి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఆయన హయాంలోనే కృత్తివెంటి ఉద్యాన పాలిటెక్నిక్, కృత్తివెంటి వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు సమయంలో కృత్తివెంటి డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా, పిల్లి సుభాష్ చంద్రబోస్ మంత్రిగా ఉన్న సమయంలోనే ఇక్కడి మైదానంలో జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ప్రముఖుల విద్యాభ్యాసం

విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు ఈ స్కూల్లో ఆరో తరగతి చదువుకున్నారు. సినీ ప్రముఖులు మిత్తపాటి కామేశ్వరరావు, మాస్టర్ రాజు, ఫోటోల నారాయణస్వామి, సంగీత దర్శకుడు జేవీ రాఘవులు, క్యారెక్టర్ యాక్టర్ రాళ్లపల్లి, కెమెరామెన్ చోటా కె.నాయుడు, మెజీషియన్ వి. పట్టాభిరామ్, రావుల పర్తి భద్రిరాజు, ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, పైడిపాల, సినీగేయ రచయిత అదృష్ట దీపక్, ద్విభాష్యం నగేష్ బాబు, వెదురుపాక విజయదుర్గపీఠం గాడ్ తదితరులు ఇక్కడే విద్యను అభ్యసించారు.

పుదుచ్చేరి సర్వతోముఖాభివృద్ధికి కృషి



ఎల్జీ కైలాషనాథన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి తదితరులు

యానాం: పుదుచ్చేరి సర్వతోముఖాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాషనాథన్ అన్నారు. యానాంలో జరుగుతున్న ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శన బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎల్జీ మాట్లాడుతూ సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం యానాంలో కన్పిస్తోందన్నారు. అంతకు ముందు ఆయనను ఘనంగా సత్కరించారు. కాగా..యానాం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన సమస్యలను ఎల్జీ కైలాషనాథన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ప్రజా ఉత్సవాల వేదికపై ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల వేట నష్టపరిహారం అర్హులైన వారికి అందేలా తాను చర్యలు తీసుకున్నానన్నారు. రహదారి విస్తరణ, పలు శాఖల్లో ఉద్యోగుల పర్మినెంట్ తదితర వాటిని ఎల్జీకి వివరించారన్నారు.

రాష్ట్రస్థాయి విజ్ఞాన ప్రదర్శనలో కోనసీమ సత్తా



బహుమతులు అందుకుంటున్న వన్నె చింతలపూడి విద్యార్థులు

సాక్షి, అమలాపురం: విజయవాడలోని మురళి రిసార్ట్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి దక్షిణ భారత విజ్ఞాన ప్రదర్శనలో కోనసీమ జిల్లా సత్తాచాటింది. మొత్తం 35 ప్రాజెక్టులలో నాలుగు ప్రాజెక్టులు కోనసీమ జిల్లా నుంచి ఎంపికయ్యాయి. వ్యక్తిగత విభాగంలో అల్లవరం మండలం గోడి రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన మ్యాజిక్ అంబ్రెలా, రావులపాలెం మండలం ఊబలంక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి రైన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ఎంపికయ్యాయి. సామూహిక విభాగం నుంచి అమలాపురం రూరల్ మండలం వన్నె చింతలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మల్టీ పర్పస్ టూల్ మిషన్, ఉపాధ్యాయ విభాగం నుంచి తొండవరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వేస్ట్ టు వెల్త్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. విజేతలను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జీసీ నిషాంతి, డీఈవో ఎస్.కె.సలీం భాషాలు అభినందించారు.

త్వరలో బకాయిల చెల్లింపు

- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్
- ఉత్సాహంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను త్వరలో ప్రభుత్వం చెల్లిస్తుందని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. కాకినాడలో యూటీఫ్ స్వర్ణోత్సవాలు నాలుగో రోజు రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగాయి. జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ యూటీఎఫ్ నిబద్ధతతో పని చేసే ఒక్కటి ఉపాధ్యాయ సంఘమని అభినందించారు. పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వీబీ తిరుపాణ్యం మాట్లాడుతూ కళాశాల ప్రాసస్త్యాన్ని వివరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం యూటీఎఫ్ కార్యచరణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఫిబ్రవరి 17 నుంచి కార్యక్రమాలు మొదలు పెడతామన్నారు. దీనికోసం ఫిబ్రవరి 2న విజయవాడలో సన్నాహక సదస్సు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తర్వాత ఉత్తరాంధ్ర, గోదావరి, ఉత్తర రాయలసీమ, దక్షిణ రాయలసీమల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, సాంకేతిక స్పృహను పెంపొందించాలన్నారు. అనంతరం రాష్ట్రంలో 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో జిల్లాల వారీగా విశ్లేషణ జరిపి పలు తీర్మానాలు ఆమోదించారు. కాకినాడ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.నగేష్, టి చక్రవర్తి, ఐ.ప్రసాదరావు, చిలుకూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

రాష్ట్ర కమిటీ ఎన్నిక

యూటీఎఫ్ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నికల అధికారి జి .ప్రభాకర్‌వర్మ ఏకగ్రీవంగా ప్రకటించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా ఎన్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కె.సురేష్ కుమార్, ఏఎన్ కుసుమ కుమారి, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ఎస్ ప్రసాద్, కోశాధికారిగా ఆర్.మోహన్ రావు, 15 మంది రాష్ట్ర కార్యదర్శులు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టీఎస్ఎన్ఎల్ మల్లేశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా కె.సురేష్ కుమార్, ప్రచురణల కమిటీ చైర్మన్‌గా ఎం.హనుమంతరావు, కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, అధ్యయన కమిటీ అధ్యక్షుడిగా పి.బాబురెడ్డితో పలు సబ్ కమిటీలు ఏర్పాటు చేశారు.

తీర్మానాలు

సీపీఎస్ రద్దు, 117 జీవో రద్దు, ప్రాథమిక పాఠశాల వ్యవస్థ, 1 నుండి 5 వరకూ తరగతులు పునరుద్ధరణ, హైస్కూల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కొనసాగింపు, ఆర్థిక బకాయిలు చెల్లింపు, ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, 12వ నూతన వేతన సవరణ సంఘం నియమించడం, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ, యాప్స్ భారం తగ్గించడం తదితర తీర్మానాలు చేశారు. .

ఇసుక తవ్వకాలకు అనుమతులివ్వాలి

అమలాపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా పట్టా భూములలో ఉన్న ఇసుక తవ్వకాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కమిటీ సభ్యులను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లలో తవ్వకాలను సాధ్యమైనంత ఎక్కువగా నిర్వహించాలన్నారు. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయాలన్నారు. కొత్తగా ఏజెన్సీలు నియమించిన మూడు రీచ్‌లలో వారం రోజులలో ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఆర్డీవోలు శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ఎల్.వంశీధర్ రెడ్డి, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ టి.సుజాత, జీఎస్‌డబ్ల్యూఎస్ కో ఆర్డినేటర్ సువిజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

చాంపియన్ షిప్ ట్రోఫీల ఆవిష్కరణ

అమలాపురం టౌన్: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ నెల 12న అమలాపురం గడియారం స్తంభం సెంటర్ యునైటెడ్ డిస్ట్రిక్ట్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ చాంపియన్ షిప్ ట్రోఫీలను స్థానిక హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్‌లో బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు తదితరులు ప్రసంగించారు. ఈ పోటీలు అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు.

ఫిట్స్‌తో వ్యవసాయ కూలీ మృతి



ఫిట్స్‌తో మృతి చెందిన సుబ్బారావు

నల్లజర్ల: కవులూరు బస్టాప్ సమీపంలో బుధవారం ఉదయం ఒక వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అతడి వద్ద విజయవాడ నుంచి నల్లజర్ల వరకు వచ్చిన బస్ టికెట్ మాత్రమే ఉంది. దీంతో పరిసర గ్రామస్తులను విచారణ చేయగా అతడు గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన కట్టపోగు సుబ్బారావు(57)గా గుర్తించారు. పోతవరంలో పొగాకు బ్యారను పనుల కోసం వస్తుండగా ఫిట్స్ వచ్చి మృతి చెందినట్లుగా భావిస్తున్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.